క్లుప్తంగా

పదోన్నతులు బాధ్యత మరింత పెంచుతాయి



వనపర్తి: పోలీసు శాఖలో పదోన్నతులు వారిపై బాధ్యతను మరింత పెంచుతాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లాలోని రేవల్లి పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ పి.మల్లయ్య, వీపనగండ్ల ఏఎస్ఐ చంద్రారెడ్డి, పెద్దమందడి ఏఎస్ఐ మహ్మద్ నయీమొద్దీన్, చిన్నంబావి జయన్న ఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. పదోన్నతి పొందిన వారిని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వారిని అభినందించి పదోన్నతి చిహ్నాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తించే ప్రతిఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ, మర్యాదలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వు సీఐ అప్పలనాయుడు, పదోన్నతి పొందిన ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డుగా కూలిన చెట్టు



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్లలో గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భారీ నీలగిరి చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిందని స్థానికులు తెలిపారు. దీంతో పాఠశాల కాపౌండ్ వాల్ ధ్వంసమై, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఆత్మకూర్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. శుక్రవారం రేచింతల శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ హరీశ్‌రెడ్డి, ఓనర్ నర్సింహారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.

క్రీడాకారులకు హాకీ స్టిక్స్ వితరణ



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి హాకీ శిబిరంలో హాకీ క్రీడాకారులకు సరిపడా స్టిక్స్ లేవని తెలుసుకొని గ్రామానికి చెందిన నవభారత్ యూత్ అధ్యక్షుడు సురేష్‌కుమార్ యాదవ్, శ్రీకాంత్ 15 స్టిక్స్ క్రీడాకారులకు అందజేశారు. వేసవి శిబిరం నిర్వహణకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నిరంజన్‌గౌడ్, క్రీడాకారులు తేజ, బన్నీ, నాయకులు గోవర్ధన్, కృష్ణకుమార్, రాఘవేందర్, బంటి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

వనపర్తి: జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణకు సంబంధించి 'మైనార్టీ అడ్మిషన్ పోస్టర్'ను కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం విడుదల చేశారు. 5, 6, 7, 8, 9, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పై తరగతుల్లో ప్రవేశాల కోసం TGMRIS వెబ్‌సైట్‌లో www.tmris.telangan a.cgg.gov.in ద్వారా అడ్మిషన్ చేసుకోవాలని లేదా నేరుగా స్కూల్, కళాశాలలో ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ అఫ్జలుద్దీన్, డీఐఈఓ ఎర్ర అంజయ్య, ఆర్ఎల్‌సీ కిరణ్మయి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు హవీలారాణి, ఆనంద్‌బాబు, సౌమ్య, శ్రీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

డెంగీని తరిమికొడుదాం



గోపాల్‌పేటలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ డెంగీని తరిమికొట్టాలని సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వైద్య సిబ్బంది పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందడం వల్లనే డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతుందని, దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకుంటూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆత్మకూర్: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని వైద్యుడు ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ఎస్‌యూఓ కేశవులు, సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ చాంద్‌పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నుంచి బస్టాండు వరకు వైద్య సిబ్బంది ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సిద్ధగౌడ్, సిబ్బంది సుచిత్ర, నీగమణి, కౌసల్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



ఆత్మకూర్‌లో..

'సురక్షిత ప్రయాణం చేద్దాం'



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆత్మకూర్: సురక్షిత ప్రయాణం చేయడం ద్వారా ఇంటి క్షేమంగా చేరుకుంటామని, వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులు, ప్రయానికులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, నెంబర్ ప్లేట్లు ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రోషయ్య, హెచ్‌సీలు బాలీశ్వర్‌రెడ్డి, రవీందర్, సిబ్బంది బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, రాములు, వాహనదారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తే సహించం



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

పాన్‌గల్: రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయకపోతే సహించమని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సింగిల్‌విండో ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు 60 వేల టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నెల అవుతున్నా కొనుగోలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ధాన్యం కాంటా అయిన రైతులకు సైతం ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సన్నాలకు ప్రకటించిన బోనస్ రూ.500 వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సహకార జిల్లా యూనియన్ డైరెక్టర్ దేవేందర్, రైతు సంఘం నాయకులు జమ్ములయ్య, బీమయ్య, మండ్ల సాయిలు, సత్యం, గన్యానాయక్, భగవంతు, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వస్తువుల అందజేత



వెండి వస్తువులు ఆలయ కమిటీకి అందజేస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయాన్ని శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ అర్చకులు గోవర్ధనాచారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన లలితా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి రావుల పద్మమ్మ జ్ఞాపకార్థం 50 తులాల వెండితో చేయించిన శఠగోపం, స్థాలి, ఉద్ధరిని, అరివేని పాత్ర, గంట వస్తువులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అమ్మవారి ప్రతిష్ఠ కోసం కృషిచేసిన కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రావులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వనం రాములు, దిలీప్ రెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి వడ్డె ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివిద్దాం

ధరూరు: ఆడ పిల్లలను చదివించడంతో పాటు వారిని రక్షించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాంపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో అవగాహన సమావేశం నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో నినాదంతో ముందుకు సాగాలన్నారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్య వివాహాలపై అవగాహన ఉండాలన్నారు.

నిరుపయోగంగా విశ్రాంత భవనం

- శిథిలావస్థకు చేరిన గోపల్‌దిన్నె రిజర్వాయర్ అతిథి గృహం
- పట్టించుకోని అధికారులు



పేకాట స్థావరంగా మారిన విశ్రాంతి భవనం



శిథిలావస్థకు చేరిన గోపల్‌దిన్నె రిజర్వాయర్ వసతిగృహం

వీపనగండ్ల: రైతుల ప్రయోజనాల కోసం రూ.లక్షలు ఖర్చు చేసిన గోపల్‌దిన్నె రిజర్వాయర్ అతిథి గృహం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకొని మందుబాబులకు నిలయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొద్దిపాటి మరమ్మతు చేస్తే రిజర్వాయర్ వద్దకు వచ్చే ఉద్యోగులకు, పరిసర గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

మందుబాబులకు అడ్డాగా..

గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద అన్ని వసతులతో నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరుకుని మందుబాబులు, జూదరులకు నిలయంగా మారడంతో అటుగా వెళ్లే మహిళా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రిజర్వాయర్ వద్ద ఫిల్టర్ బేస్ నిర్మించి 3 మండలాల్లోని 28 గ్రామాలకు తాగు నీరు అందిస్తుండడంతో దాదాపు 20 మంది ఉద్యోగులు ఫిల్టర్ బేస్ వద్దనే పనిచేస్తుంటారు. విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తెస్తే వేసవి, వర్షాకాలంలో ఫిల్టర్ బేస్ వద్ద పనిచేసే ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుంది.

వినియోగంలోకి తెస్తే..

రిజర్వాయర్ వద్ద ఉన్న భవనాన్ని వినియోగంలోకి తెస్తే మండలంలోని రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవసరమైన సమావేశాలను నిర్వహించే వీలు కలుగుతుంది. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు విశ్రాంతి భవనంలో ఉంటూ రిజర్వాయర్, ఔట్‌ఫాల్ నీటి సరఫరా, ఫిల్టర్ బేస్ నిర్వహణ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సమీక్షించే వసతి కలుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లష్కర్లకు ఇబ్బందులు



రిజర్వాయర్ నుంచి ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాలతో పాటు పెంట్లవెల్లి మండలంలోని పలు గ్రామాల రైతులకు సాగునీటిని అందించే వసతులను మెరుగుపరిచేందుకు పర్యవేక్షణ చేస్తున్న లష్కర్లు కాల్వ గట్టుపైనే నిద్రించాల్సి వస్తుంది. విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తెస్తే లష్కర్లకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ గోపల్‌దిన్నె

ప్రత్యేక నిధులు కేటాయించాలి



విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. గతంలో నిర్మించిన రూంలలోని తలుపులు, కిటికీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. మందుబాబులు, పేకాటరాయుళ్ల నుంచి విముక్తి కలిగించాలంటే నిర్వహణకు అధికారులను నియమించాలి.

– సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్, రంగవరం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన నిధులతో పాటు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులకు అవసరమైన నివేదికలను పంపిస్తాం. చుట్టుపక్కల పంట పొలాల రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు విశ్రాంతి భవన ఆస్తులను పరిరక్షించేందుకు అధికారులకు సహకరించాలి.

– సతీష్, ఏఈ,జూరాల ప్రాజెక్టు పెబ్బేరు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

ఆత్మకూర్: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన ఎంవీ రామన్ హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు సంస్కృతి 491, అభిగ్నసత్య 484, శ్రీరాంరెడ్డి 483, రాంచరణ్ 481, హర్షిత్ 480, కార్తీక్‌రెడ్డి 480, నవదీప్ 480, నరేష్ 479, పవన్‌రెడ్డి 477, నవదీప్ 475, ప్రసన్న 475, సందీప్‌రెడ్డి 474 ని సన్మానించారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే కష్టపడి చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ అన్సి శ్రీధర్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

'చదువుతోపాటు సంస్కారం నేర్పాలి'



మాట్లాడుతున్న దేశాయి ప్రకాష్‌రెడ్డి

అమరచింత: తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు సమాజంలో ఎదుటివారిని గౌరవించే సంప్రదాయాలు, సంస్కారం నేర్పించినప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం చదువే కాకుండా నిత్యజీవితంలో బతకడం ఎలా అన్న విషయాలను సైతం విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. మారుతున్న కాలంలో విద్యార్థులకు చక్కటి అలవాట్లతో పాటు సంస్కారం నేర్పించేందుకు వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ కళలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థుల్లో దేశభక్తితో పాటు అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేసే విధంగా తీర్చిదిద్దేందుకు అక్షరవనం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని 7 జిల్లాలో వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శృతి లయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్, ఎంఈఓ భాస్కర్‌సింగ్, జోనల్ ఇన్‌చార్జ్ బాలకృష్ణ, జిల్లా క్యాంపు ఇన్‌చార్జ్ రామేశ్వరమ్మ, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఇబ్బందులు కలిగించొద్దు



కూలీలతో మాట్లాడుతున్న అజయ్

అమరచింత: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు 8 వారాలుగా కూలి డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక పోరాటాల వల్ల వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్టు ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, ఆశిరెడ్డి, చెన్నప్ప, మాధవి, సత్యమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

ప్రతి మనిషికి నీరే జీవనాధారం



వాటర్ ఫిల్టర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ గిరిధర్

వనపర్తి రూరల్: ప్రతి జీవికి నీరు జీవనాధారమని, ఆరోగ్యంగా జీవించడానికి అందరూ స్వచ్ఛమైన నీటిని తాగాలని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. శుక్రవారం పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో కమ్యూనిటీ ప్యూరీ వాటర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణంగా నీరు సహజ మినరల్ స్ప్రింగ్స్ నుంచి వస్తుందని, ఈ నీటిలో లవణాలు, ఇతర ఖనిజాలు ఉంటాయన్నారు. ఈ నీటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు అదనంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వనపర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ మేనేజర్ రమేష్, సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, మజీద్, సంతోష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలు విజయవంతం చేద్దాం



పట్టణ అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న సతీష్‌యాదవ్

వనపర్తి విద్యావిభాగం: ఈనెల 24న నిర్వహిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపైనే చర్చిస్తూ, అవి పూర్తి చేయించడానికి పోరాడతామని, ప్రతి మండలం, పట్టణాల కమిటీలతో బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణ కమిటీలను ఏర్పాటు చేయగా.. అధ్యక్షుడిగా రామస్వామిని, ప్రధాన కార్యదర్శిగా కురుమూర్తిని నియమించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్, గొనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, కృష్ణయ్య, నాగరాజు, పుట్టపాక బాలు, పాషా ఉన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

గోపాల్‌పేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాజీ సర్పంచులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శంకర్‌కు మాజీ సర్పంచ్‌లు వినతి పత్రం అందించారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వీధిలైట్లు, తాగునీటి సరఫరాలో అంతరాయం, డ్రెయినేజీ పూడికతీయని కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీనివాసులు, బాల్‌రాజు, రాజు, గోపాల్‌పేట మండల మాజీ వైఎస్ ఎంపీపీ చంద్రశేఖర్, కాశీనాథ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మాంసం వ్యర్థాల వేలం రూ.15.50 లక్షలు

వనపర్తి టౌన్: వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో మాంసం వ్యర్థాల సేకరణకు నిర్వహించిన వేలం రూ.15 లక్షలు పలికింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన మాంసం (చికెన్, మటన్, చేపల) వ్యర్థాల వేలంలో 8 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కారు పాటను అధికారులు రూ.15 లక్షలతో మొదలుపెట్టగా ఒక్కొక్కరు రూ.2 వేలు, 5వేలు, 10వేల చొప్పున పాట పాడుతూ చివరికి రూ.15.50 లక్షలకు పాట పాడి మౌనంగా ఉండిపోయారు. దీంతో వేలం సర్కార్ పాట కంటే కేవలం రూ.50 వేలే అధికంగా వచ్చింది. వేలం పాటకు వచ్చిన వారు ముందుగానే రింగ్ అయ్యారని స్థానికంగా చర్చించుకున్నారు. గతేడాది ఆగస్టులో కేవలం 8 నెలల కాల పరిమితికే రూ.29.25 లక్షలు పాట పాడగా ఈసారి కేవలం రూ.15.50 లక్షలే పలకడం విస్మయం కలిగించింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.